# మహిమ పరచెను




"అయినను మనమాయన వాగ్దానమునుబట్టి క్రొత్త ఆకాశములకొరకును క్రొత్త భూమి కొరకును కనిపెట్టుచున్నాము; వాటియందు నీతి నివసించును." 2 పేతురు 3:13

## GLORIFIED

**నిత్యత్వము నుండి నిత్యత్వమునకు** | **మహిమ పరచెను** | **ఐదవ పాఠము**

*"కాబట్టి విశ్వాసమూలమున మనము నీతిమంతులముగా తీర్చబడి మన ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా దేవునితో సమాధానము కలిగియుందము. మరియు ఆయనద్వారా మనము విశ్వాసము వలన ఈ కృపయందు ప్రవేశము గలవారమై, అందులో నిలిచియుండి, దేవుని మహిమను గూర్చిన నిరీక్షణనుబట్టి అతిశయ పడుచున్నాము. అంతేకాదు శ్రమ ఓర్పును, ఓర్పు పరీక్షను, పరీక్ష నిరీక్షణను కలుగజేయునని ఎరిగి శ్రమలయందు అతిశయపడుదము. ఎందుకనగా ఈ నిరీక్షణ మనలను సిగ్గుపరచదు. మనకు అనుగ్రహింపబడిన పరిశుద్ధాత్మద్వారా దేవుని ప్రేమ మన హృదయములలో కుమ్మరింప బడియున్నది.* *రోమా. 5:1-5*

క్రీస్తునందున్న దేవుని బిడ్డల యొక్క ఆత్మీయమైనట్టియు, మానసికమైనట్టియు పరిస్థితిని అపొస్తలుడైన పౌలు పై లేఖనములో వర్ణించెను. నీతిమత్వారోపణ మూలమున మనము "సమాధాన శిఖరము" మీద నిలుతుము. లోకములోని పాపుల జీవితములలో ఈ సమాధానము కరువగుచున్నది. అయినను, క్రొత్తజన్మద్వారా వారు క్రీస్తులోనికి వచ్చిన యెడల దేవునితో ఈ సమాధానమును వారు కూడా అనుభవింపగలరు, "ఆయన ద్వారా మనము విశ్వాసము వలన ఈ కృపయందు ప్రవేశము గలవారమై అందులో నిలిచి యుండిన" మీదట పరలోకమందు దేవుని నిత్యరాజ్యమందలి దేవుని మహిమలో పాలివారము కాగలమని గ్రహించుట కారంభించితిమి. కాలాంతమున నిత్యత్వములో విశ్వాసులైన క్రైస్తవులకు దేవుడనుగ్రహించు దానిని క్లుప్తీకరించుటకు "మహిమ పరచెను" అనుమాట శ్రేష్టమైనది.

దేవుడు మానవాళిని సృష్టించినప్పుడు మహిమ కొరకైన గొప్ప అవసరతను ఆయన మనలో ఉంచెను. ఈ మనోవైజ్ఞానిక భావనను పిల్లలలో గ్రహించుట సులభము. ఏదో యొక దానిని సాధించి, ఆ మీదట వారి సాధనలో వారు ఇతరులచేత అంగీకరింపబడు దానికంటే యౌవనస్థులను ఎక్కువగా తృప్తిపరచునది మరొకటిలేదు. మనకు మహిమనిచ్చు రెండు ప్రాథమిక అవసరతలు గలవు. అవేవనగా, సాధన మరియు ఈ సాధనలో మనము ఇతరులచేత అంగీకరింపబడుట. దేవుని కృపనుబట్టి క్రైస్తవులమైన మనము దేవునియొక్క కుమారులు, కుమార్తెలుగ పాత్రను సాధించి, మన యొక్క పాత్రలో దేవత్వముచేతను. సంఘముచేతను అంగీకరింపబడితిమి (2 కొరింథీ. 6:17-18).

దేవునితో సమాధానము కలిగియుండిన మీదటనే మనము దేవునిమహిమలో పాలివారము కాగలమను అవకాశమును గూర్చి ధ్యానింప గలవారమగుదుము. "దేవుని మహిమను గూర్చిన నిరీక్షణనుబట్టి అతిశయపడుచున్నాము" అని అపొస్తలుడైన పౌలు చెప్పెను. క్రైస్తవులమైన మనము ఇప్పుడే దేవుని రాజ్యము యొక్క సంపూర్ణ మహిమను పొందముగాని మహిమకొరకైన మన అవసరత యొక్క సంపూర్ణ తృప్తిని గూర్చిన నిరీక్షణ మన జీవితములలో శక్తివంతమైన గురి యగును. మన యొక్క నిరీక్షణ శీలము యొక్క శక్తిని వృద్ధిచేయును. శీలము యొక్క బలము మన ఆనందమును వృద్ధిచేయును. ప్రతి ఒక్కరు బలముగా ఉండవలెనని కోరుదురు. అయితే, "అది ఎట్లు?" అని మనము అడుగవలసియున్నది.

శ్రమల ద్వారా బలమైన శీలము అభివృద్ధి చెందునని మన లేఖన భాగములో మనము చూచితిమి అయినను, సాధారణముగా శ్రమలు మనకు రుచించవు. తత్ఫలితముగా, శ్రమలయందు ఆనందించుటకు మార్గమును కనుగొనుటయే ఆనందమునకు మూలము. (ఏలాగయినను శ్రమలను మనము తప్పక పొందుదుము). శ్రమలయందు ఆనందించుట ఎట్లో మన లేఖన భాగము చూపుచున్నది. మొదటిగా, మనము నీతిమంతులముగా తీర్చబడినందున దేవునితో సమాధానమును సంపాదించుకొంటిమి. రెండవదిగా, దేవుని కుమారుల యొక్క మహిమను గూర్చిన నిరీక్షణ యందు ఆనందింతుము. కాని, ఇక్కడే కష్టతరమైన పాత్రగలదు. ఏలయనగా, మనము దేవుని పిల్లలమైనందున శీలము, వ్యక్తిత్వము అనువాటిలో యేసు యొక్క సారూప్యము




లోనికి మార్చబడవలసిన వారమైయున్నాము. (రోమా. 8:29). బహుశా, ఆయన యొక్క సంపూర్ణ పురుషత్వమును ఈ జీవితములో మనమెన్నడును పూర్తిగా సాధించలేము. కాని, ఆయనే మనగురి. ఇతర సంగతులన్నియు సరియైనవిగా నుండిన యెడల, నీతి విషయమైన శ్రమ యేసువంటి శీలమును వృద్ధి చేసుకొనుటలో మనకు సహాయము చేయును (హెబ్రీ. 12:1-13). శ్రమ ఓర్పును, ఓర్పు పరీక్షను, పరీక్ష శీలమును వృద్ధి చేయును. ఆమీదట మన నిరీక్షణ మన యొక్క లక్ష్యమును సాధించు దిశగా బలపరచబడుచుండును. రోమా. 5:1-5 వరకు చెప్పబడిన చక్రము (cycle)ను మనము అనుసరించుచు, ఆత్మీయ పెరుగుదలలో మనము సాధించిన విజయమునుబట్టి మన శ్రమలయందు అనందించుటకు మనము ఆరంభింతుము.

సమాధానము మరియు నిరీక్షణ అనువాటిని మనము కలిగియుండిన పిమ్మట "శ్రమలయందు అతిశయింతుము (ఆనందింతుము)" అని మన లేఖన భాగము తెలుపుచున్నది. ఒక బంగారు పతకమును గెలుచుకొనుటవలన లభించు మహిమను పొందవలెనని ఒలింపిక్ క్రీడలలో పోటీచేయు జెట్టి (athlete) అనేక సంవత్సరములు శ్రమపడును. మహిమ కొరకైన నిరీక్షణను బట్టి వారిట్టి శ్రమను భరించు అవకాశమునందు సంతోషింతురు. క్రైస్తవులమైన మనము "నిరీక్షణా శిఖరము"పై నిలిచిన యెడల మనము కూడా మన శ్రమల యందు ఆనందింతుము. పరలోకములో యేసు యొక్క మహిమలో పాలుపొంద నిరీక్షింపగోరుటకు ముందు ఆయనవంటి శీలమును మనము తప్పక కలిగియుండవలెను. కావున, "మన శ్రమలయందు అతిశయింతుము."

యేసు మరలా వచ్చునపుడు విశ్వాసులైన క్రైస్తవులకు చెందు సంపూర్ణ మహిమను మనమిపుడు పరిశీలన చేయుదము. మనము దేవుని కుమారులమై యున్నందున దేవుని రాజ్యము, నిత్యజీవము అను వాటికి వారసులమై యున్నాము (మత్తయి 19:29; 25:34). దేవుని ప్రేమించు వారు ఇపుడు దేవుని రాజ్యమునకు వారసులైయున్నారు. మరియు వారు జీవకిరీటమును పొందుదురు (యాకోబు 1:12; 2:5).

మనము క్రీస్తునందు నిద్రించిన యెడల క్రీస్తు రెండవ మారు వచ్చునపుడు మన ఆంతర్యపురుషుడు మరణపు నిద్రనుండి మేల్కొని మహిమ యుక్తమైన ఆత్మసంబంధమైన శరీరమును ధరించునని మనము నిరీక్షింపగలము (రోమా. 8:11; 1 కొరింథీ. 15:42-44). యేసు వచ్చునప్పటికి మనము జీవించి యుండిన యెడల మన దేహములు మర్త్యత నుండి అమర్త్యతకు మారును (1 కొరింథీ 15:51-53). దేవుని కుమారులుగను మరియు మన ఆత్మసంబంధ శరీరములతోను మనము నిత్యజీవము మరియు దేవుని రాజ్యము అను వాటిని స్వాస్థ్యముగా పొందుదుము.

క్రైస్తవులమైన మనము ఆచరణీయమైన రీతి (practical way)లో మన స్వాస్థ్యమును గూర్చి గ్రహించుకొన ప్రయత్నించుదము. దేవుని నిత్యరాజ్యములోని జీవితము కొరకై మనమిపుడు సిద్ధపడునట్లు ఇది మనకు బలమునిచ్చును. మృతుల పునరుత్థానము తరువాత ఉండు సంగతులను గూర్చిన శూన్యదృక్పథము (blurred-out view)తో మృతుల పునరుత్థానమును గూర్చిన నిరీక్షణ కలిగియుండినంత మాత్రమున సరిపోదు. అంతకుమించిన దృక్పథము మనకు అవసరము.

ఆత్మసంబంధమైన అనేక భావనలను గూర్చిన అవగాహన క్రైస్తవుని స్వాస్థ్యమును గూర్చిన పఠనమునకు అవసరము. మొదటిగా, మనమెరుగ వలసినదేమనగా, "స్వతంత్రించుకొనుట"యను మాట లౌకిక ప్రయోగములో ఎట్లు ప్రయోగింపబడినదో, అట్లే క్రొత్తనిబంధనలోను ప్రయోగింపబడినది. కోర్టులో మన స్వాస్థ్యము మనకు నిశ్చితమై నప్పుడు (finalized) మనము స్వతంత్రించుకొను దానిని మన సొంతముగా సంపాదించు కొందుమని మనమెరుగుదుము. దేవుని కుమారులుగా దేవుని రాజ్యమును మనము స్వతంత్రించుకొని, తత్ఫలితముగా మనము ఆ రాజ్యములో శాశ్వతముగా ఒక స్థిరమైన భాగమౌదుము. దేవుని రాజ్యమును మనము మన వశము చేసుకొనము. కాని, నిరంతరము మనము దేవుని రాజ్యములో దేవుని పరిపాలనకు లోబడుచుందుము. రాజ్యము అను మాట పరిపాలనను సూచించును. మనము మనలను దేవుని ఏలనివ్వ గలుగునట్టి పరిస్థితులు పరలోకములో ఉండును. ఆయన మన అధికారిగా నుండునప్పుడు ఎల్లవేళలా జీవితము మంచిదిగా నుండునని మనము నమ్ముదుము.

క్రైస్తవులుగా మనము ఇపుడు మన జీవితములను యేసుక్రీస్తు ఏలుటకిష్టపడుదుము. అన్నివేళలా మన జీవితమంతటినీ ఆయనను ఏలనివ్వని న్యాయమైన కొన్ని ఆటంకములు గలవు. అట్టి ఆటంకములలో కొన్ని ఏవనగా, భౌతిక శరీరములు, సాతాను, లోకములోని పాపులు మరియు సంఘములోని ఆటంకపరులు. యేసు యొక్క రెండవరాకడ, మృతుల పునరుత్థానము, అంత్యతీర్పు అనునవి ఈ ఆటంకములన్నింటిని తొలగించివేయును.

మనయొక్క భౌతికమరణము మరియు పునరుత్థానము దురాశకు లోనగు మన స్వభావము నుండి మనలను విడిపించును (రోమా. 13:14; 2 కొరింథీ. 5:1-3). యేసుయొక్క రాకడలో సాతాను ఒక ఆటంకపరుడుగా మన యొద్ద నుండి శాశ్వతముగా తీసివేయబడును (1 పేతురు 5:8; ప్రకటన 20:10). మంచిచెడ్డల జ్ఞానమును వినియోగించుకొను స్థాయికి పెరిగిన అవిశ్వాసు లందరును నరలోకములోనికి పడద్రోయ బడుదురు (1 థెస్స. 1:6-10; ప్రకటన 20:12-15). దుర్నీతి పరులందరిని, ఆటంకపరులందరిని ఈ తీర్పులో యేసు తన రాజ్యములో నుండి తీసివేయును (మత్తయి 7:21-23; 13:40-43). ఈ ఆటంకములు తీసివేయబడును, మరియు మనయొక్క చిత్తము సరియైనదై యుండగను నిత్యమూ మన తండ్రిగా మనము మనలను దేవుని పాలింపనీయలేకపోవుటకు కారణమేదియు ఉండదు. మన జీవితములలో అన్ని భాగములను ఇపుడు దేవుడు ఏలవలెనని మనము కోరని యెడల యేసుక్రీస్తుయొక్క రాకడలో పరిష్కరింపబడని సమస్యను మనము కలిగి యుందుము. క్రైస్తవులు కొందరు నరకమునకు వెళ్ళవచ్చును (యాకోబు 5:19 -20). "గొఱ్ఱెలతో" కలిసి తీర్పు నుండి బయలు వెడలిన క్రైస్తవులు దేవుని రాజ్యమును స్వతంత్రించుకొందురు. ఆటంకముల నుండి విడుదల పొందినవారమై దేవునిపాలనను నిత్యజీవము అను మన స్వాస్థ్యమును మనము అర్థము చేసికొనవలెననిన, "దేవుని ఎరుగుట" నిత్యజీవములోని ఒక సంగతిగా యేసు వర్ణించెనని మనము ఎరుగవలెను (యోహాను 17:3). అపొస్తలుడైన యోహాను చెప్పినట్లు దేవుని ఎరుగుట అనగా దేవుడు ఆలోచించునట్లును, అనుభూతి చెందునట్లును మనము ఆయనను గూర్చియు, ఇతరులను గూర్చియు ఆలోచించుట మరియు అనుభూతిచెందుట.

*ప్రియులారా, మనము ఒకనినొకడు ప్రేమింతము ఏలయనగా ప్రేమ దేవుని మూలముగా కలుగుచున్నది: ప్రేమించు ప్రతివాడును దేవుని మూలముగా పుట్టినవాడై దేవుని ఎరుగును. దేవుడు ప్రేమాస్వరూపి: ప్రేమలేనివాడు దేవునిఎరుగడు. 1 యోహాను 4:7-8*

మరి యొక విధముగా చెప్పవలెననిన, క్రొత్తనిబంధనలో తర్జుమా చేయబడి యుండినట్లు జీవము అనగా మన తండ్రియైన దేవునియొక్కయు, యేసుక్రీస్తు యొక్కయు వ్యక్తిత్వ శీలములవంటి వ్యక్తిత్వము మరియు శీలము (ఎఫెసీ. 5:1). దేవుడు ప్రేమయై యున్నాడు. మనము ప్రేమించుట నేర్చుకొంటిమి. యేసు యొక్క జీవపు లక్షణములను ఇపుడు అభివృద్ధి చేసుకొనుటలో మనము పోరాటము కలిగియున్నాము. అయినను, ఈ శరీరములో నుండగా మనము పరిపూర్ణతకు చేరలేము. అందునిమిత్తమే మన యొక్క ప్రస్తుత జీవము "నీతిమంతులుగా తీర్చబడిన జీవము" (justified life) అని వర్గీకరింపబడినది (రోమా. 5:17- 18). పరలోకములో మనలను నీతిమంతులుగ తీర్చువాడుగా యేసు పనిచేయడు. కావున, మనము నిత్యజీవమును స్వతంత్రించు కొనునప్పుడు మన లక్ష్యమును సాధింతుమని మనము నిర్ధారింపవచ్చును.

మనము జీవకిరీటమును పొందుదుము (ప్రకటన 2:10). మన యొక్క వ్యక్తిత్వ లోపములన్నియు, శీలబలహీనతలన్నియు తీసివేయబడును. ఏవిధమైన సంపూర్ణత కొరకు మనమిపుడు కృషిచేయుచున్నామో ఆ విధమైన సంపూర్ణ వ్యక్తులుగా మన మగుదుము (ఎఫెసీ. 4:13). నిత్యజీవమును స్వతంత్రించు కొనుట అనగానేమో ఈ క్రింది వచనము చెప్పుచున్నది.

*"తన నిత్యమహిమకు క్రీస్తునందు మిమ్మును పిలిచిన సర్వకృపానిధియగు దేవుడు. కొంచెము కాలము మీరుశ్రమపడిన పిమ్మట, తానే మిమ్మును పూర్ణు లనుగా చేసి స్థిరపరచి బలపరచును." 1 పేతురు 5:10*

మన యొక్క స్వాస్థ్యమును గూర్చి మనము ఎరిగియుండుట క్రైస్తవులమైన మనకు ఎంతముఖ్యము? పరిశుద్ధాత్మ మన స్వాస్థ్యమునకు సంచకరువుగా పరిచర్యచేయునట్లు దేవుడు యేర్పాటు చేసినంతటి ముఖ్యమైనది (ఎఫెసీ. 1:13-14).

ఈ పాఠ్యక్రమములో మీకొరకైన దేవుని ఉద్దేశ్యములను మీతోకలిసి చదువుటకు మీరిచ్చిన అవకాశము కొరకు మీకు వందనములు. బైబిలును మీరు వ్యక్తిగతముగా నేర్చుకొనుటలో మా సహాయము అవసరమైనయెడల మాకు వ్రాయండి. మా సేవలు ఉచితముగా పొందండి.

**A. సరియైన జవాబు క్రింద గీత గీయుము.**

1. క్రైస్తవులు సమాధాన శిఖరముపై నిలిచియుండుటకు హేతువు.
   a. నీతిమత్వారోపణ.
   b. ప్రార్థనలు.
2. బలమైన శీలము దేనివలన అభివృద్ధి చెందుననగా,
   a. నీతిమత్వారోపణ.
   b. శ్రమలు.
3. శ్రమను అనుభవించుటలో ఆనందించు వారెవరనగా,
   a. నిరుత్సాహముగానున్నవారు.
   b. ఒక లక్ష్యసాధన కొరకు తర్ఫీదులో నున్నవారు.
4. క్రీస్తు మరల వచ్చునప్పుడు విశ్వాసులైన క్రైస్తవులు పొందున దేమనగా.
   a. స్వాస్థ్యము.
   b. క్రియలద్వారా సంపాదించుకొనగలిగిన బహుమతులు.
5. క్రైస్తవులుగా మనమిపుడు మన జీవితములను పూర్తిగా దేవుని ఏలనివ్వ సమర్థులము కాము ఏలయనగా,
   a. శ్రమలు.
   b. ఆటంకములు.

**B. ఈ పాఠములో ఎత్తివ్రాయబడిన లేఖనముల నుండి ఖాళీలను పూరింపుము.**

1. "కొంచెము కాలము మీరు .......................... పిమ్మట, తానే మిమ్మును ...............................' ..............................................."
2. "ప్రేమించు ప్రతివాడును దేవుని మూలముగా ........................................ దేవుని ........................................................."
3. "నిరీక్షణ మనలను ........................................................................................................"
4. "........................................లేనివాడు దేవుని ........................................................................."
5. " దేవుని మహిమను గూర్చిన.......................................బట్టి అతిశయపడుచున్నాము. అంతేకాదు శ్రమ.......................................ను, ఓర్పు పరీక్షను, కలుగ జేయునని ఎరిగి శ్రమలయందు .........................................."

**C. సత్యమా? అసత్యమా? దయచేసి, సరియైన జవాబుకు టిక్కు పెట్టుము.**

1. లోకములోని పాపులు దేవునితో సమాధానము కలిగియున్నారు. (సత్యము) (అసత్యము)
2. సమాధానశిఖరమును అధిరోహించనిదే మనము నిరీక్షణాశిఖరముపై నిలువలేము. (సత్యము) (అసత్యము)
3. జీవితములలో సంభవించిన అదృష్టము యొక్క ఫలితమే సంతోషము. (సత్యము) (అసత్యము)
4. శ్రమలు మనలను ఎల్లవేళలా నిరుత్సాహవంతులుగా చేయును. (సత్యము) (అసత్యము)
5. క్రీస్తుయొక్క వ్యక్తిత్వములోనికిని, శీలములోనికిని, మార్పు చెందుటకు క్రైస్తవులమైన మనము కృషి చేయవలసియున్నది. (సత్యము) (అసత్యము)
6. విశ్వాసులైన క్రైస్తవులు తీర్పులో దేవుని రాజ్యమును స్వతంత్రించుకొందురు (సత్యము) (అసత్యము)
7. మన స్వాస్థ్యమును గూర్చి మనము అర్థము చేసుకొన అవసరము లేదు. (సత్యము) (అసత్యము)
8. తీర్పులో క్రైస్తవుల శీలమునకు ఏదో ఒకటి సంభవింపవలసియున్నది. ఏలయనగా పరలోకములో పాపపరిహారార్థబలిగా యేసు మనకు అవసరము లేదు. (సత్యము) (అసత్యము)
9. కొందరు క్రైస్తవులు నరకమునకు పోవుదురు. (సత్యము) (అసత్యము)
10. పరిశుద్ధాత్మ మన స్వాస్థ్యమునకు సంచకరువుగా పనిచేయునట్లు దేవుడు యేర్పాటు చేయునంతగా మన స్వాస్థ్యమునుగూర్చి మన మెరుగుట ముఖ్యము. (సత్యము) (అసత్యము)

ఈ కోర్సును పూర్తిచేయగోరు వారు మాకు వ్రాయండి మీరు పూర్తి చేసిన ప్రశ్నావళి మాకు పంపిన యెడల వాటిని దిద్ది తిరిగి మీకు పంపగలము.

For Copies contact:
Visit our website: www.kingdomofchrist.info
For copies contact: wayne.hwdavis@gmail.com